
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3 సిద్దిపేట
సోమవారం 24 జూన్ 2024





గోపులాపూర్ గ్రామంలోని పాన్‌చెరువు

సాగునీటి వనరుల్లో ప్రధానమైన చెరువులు, కుంటలు, శిఖం భూములు కబ్జాకోరల్లో చిక్కుకుంటున్నాయి. వందల ఏళ్లుగా సాగుకు ఆధారంగా ఉన్న చెరువులు, కుంటలు ఆక్రమణకు గురై పూర్వ రూపురేఖలను కోల్పోతున్నాయి. నారాయణరావుపేట మండలం గోపులాపూర్ గ్రామశివారులోని పాన్‌చెరువు , ఎర్రకుంటలతో పాటు మండలంలోని పలు చెరువులు, కుంటల శిఖం భూములు కబ్జాకు గురవుతున్నాయి.



చెరువులో పొక్లెయిన్‌తో తీసిన గొయ్యి

కబ్జా కోరల్లో.. పాన్‌చెరువు

- శిఖం భూమిలో యథేచ్ఛగా పనులు
- ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి పోసి చదును చేస్తున్న వైనం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు!

నారాయణరావుపేట, జూన్ 23: నారాయణరావుపేట మండలంలోని చెరువులు, కుంటలు నిండుకుండలను తలపించేవి. వర్షాలు కురవకపోయినా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని నింపేవారు. మండలంలోని గోపులాపూర్ పాన్‌చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని కొన్ని పట్టా భూముల్లో ఏక పసల్, దో పసల్ కింద రైతులు పండిస్తుంటారు. కొందరు రైతులు చెరువులోని మట్టిని ఎఫ్‌టీఎల్ లోపలికి పోస్తూ క్రమ క్రమంగా ఆక్రమిస్తున్నారు. అలాగే, పట్టా భూములకు ఆనుకుని ఉన్న శిఖం భూములను సైతం వదలడం లేదు. చెరువు చుట్టూ ఉన్న కొందరు రైతులు కబ్జా చేసి పనులు సాగిస్తున్నారని, ఇప్పటి వరకు 10 ఎకరాల మేర చెరువు శిఖం కబ్జాకు గురైనట్లు వారు ఆ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏళ్ల తరబడి దశల వారీగా సాగుతున్న ఈ తతంగం పై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రంగనాయకసాగర్ ఎడమకాలువకు పాన్‌చెరువు చివర ఉంటుంది. ఈ చెరువు ఒక్కోసారి నిండకపోతే కేవలం వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగుచేస్తుంటారు. ఇప్పుడు శిఖం భూముల్లో మట్టిని నింపితే నీటినిల్వ సామర్థ్యం తగ్గి, భూగర్భజలాలు అడుగంటిపోయే పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారులకు చెబితే క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధితశాఖ నుంచి ఫిర్యాదు వస్తే సర్వేలు చేస్తామని చెప్పి చేతులు దులుపుకుంటున్నారని, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.



పాన్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పోసిన మట్టి కుప్పలు

అధికారుల మధ్య సమన్వయ లోపం..

పాన్‌చెరువు మీదే ఆధారపడి కొందరు రైతులు వ్యవసాయం చేస్తున్నారు. కబ్జాదారుల ఇప్పుడు వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే అదునుగా భావించిన ఆక్రమణదారులు యథేచ్ఛగా ఎఫ్‌టీఎల్ పరిధిలో కబ్జాకు పాల్పడుతున్నారు. చెరువుల రక్షణ, బాధ్యత రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలదే అయినప్పటికీ చర్యలు శూన్యంగా మారాయి. పాన్ చెరువు, ఎర్రకుంట కబ్జాకు గురవుతున్న విషయమై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఇరిగేషన్ శాఖ ఈఈ లను కలిసినా క్షేత్రస్థాయిలో ఫలితంగా లేకుండాపోయిందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా కబ్జాకు గురవుతున్న పాన్‌చెరువు(పాన్‌జెరువు), అలాగే ఎర్రకుంట శిఖం భూములు వాస్తవంగా ఎంత ఉన్నాయో గుర్తించి సర్వే చేసి హద్దులను నిర్ణయించి రికార్డుల పరంగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఉదయశ్రీ వివరణ కోరగా రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుతో క్షేత్రస్థాయిలో చెరువును పరిశీలించినట్లు చెప్పారు. చెరువు శిఖం భూములను కబ్జాకు పాల్పడకూడదని స్థానిక రైతులకు సూచించినట్లు పేర్కొన్నారు. సర్వే చేపట్టాలని ఇరిగేషన్‌శాఖ కోరితే రెండు శాఖలు సమన్వయంతో ఆ పనుల చేపడతామని స్పష్టం చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం

- ఆంజనేయులు, డీఈఈ ఇరిగేషన్

గోపులాపూర్‌లోని పాన్‌చెరువు, ఎర్రకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో జరుగుతున్న ఆక్రమణపై చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాం. రెవెన్యూ అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేశాం. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎవరైె ఆక్రమణ, నిర్మాణాలు చేపట్టినా శాఖాపరమైన చర్యలు తప్పవు. రైతుల ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం.



చెరువు శిఖంలో మట్టిని తవ్విన దృశ్యం

నేటి మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్, జూన్ 23: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలతో యువజన సర్వీసుల ద్వారా సోమవారం ఉదయం నుంచి హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్‌లో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో 60కి పైగా వివిధ కంపెనీలు 5వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నాయని తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. 7వ తరగతి నుంచి ఆపై చదివిన నిరుద్యోగులందరూ ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. వివరాల కోసం 9642333667, 6300610339 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.



రాయపోల్ మండలం ఎల్కల్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

ట్రిపుల్‌ఆర్ వద్దంటూ రైతుల ఆందోళన

రాయపోల్, జూన్ 23: రీజనల్ రింగ్‌రోడ్డుతో తమ విలువైన భూములను కోల్పుతున్నామని వెంటనే అలైన్‌మెంట్ మార్చాలని రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో ఆదివారం రైతులు నిరసన తెలిపారు. త్రిపుల్‌ఆర్ నిర్వాసితులందరూ సమావేశమయ్యారు. ఈసందర్భంగా ప్రజాచైతన్య వేదిక కన్వీనర్ చీమల జగదీష్ యాదవ్ మాట్లాడారు. బేగంపేట, ఎల్కల్ గ్రామాల నుంచి వెళ్తున్న రోడ్డుతో రైతులు భూములు కోల్పోయి రోడ్డున పడతారని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో భూములు తీసుకోవాల్సి వస్తే 2013 భూహక్కు చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ భూములను ఇవ్వబోమని తెలిపారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు సురేష్, రైతులు కుమార్, పిట్ల స్వామి, జాల రాజయ్య మల్లేషం, శ్రీశైలం, బర్కం మల్లేష్, స్వామి, రమేష్, చిన్న మల్లేశం పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

బొగ్గు గనుల బహిరంగ వేలాన్ని ఉపసంహరించుకోవాలి

సిద్దిపేట అర్బన్, జూన్ 23 : కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సిద్దిపేట కొత్త బస్టాండ్ వద్ద సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణలో భాగంగా రాష్ట్రంలో సింగరేణికి కేటాయించాల్సిన బొగ్గు గనులను బహిరంగ వేలం పేరుతో ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని కేంద్రం చూస్తున్నదన్నారు. ప్రజలకు నష్టం కలిగించే ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.పద్మ, కాట మధు, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, సీఐటీయూ నాయకులు కనక రాజు, ప్రభాకర్, శ్రావణ్, రవీంద్రారెడ్డి, రాజనర్సు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్ రెడ్డి, జిల్లా నాయకులు భరత్, అభి పాల్గొన్నారు.

నలుగురు పోలీసులకు ఉత్తమ పతకాలు

సిద్దిపేట క్రైం, జూన్ 23 : పోలీసుశాఖలో ఉత్తమ సేవలందించిన సిద్దిపేట జిల్లాకు చెందిన నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లకు ప్రభుత్వం సేవా పతకాలను ప్రకటించింది. గౌరవరం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బి.వేణుగోపాల్ రావు, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్‌లో హెడ్ కానిస్టేబుల్ యం.రామ్మోహన్, సిద్దిపేట సీఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేస్తున్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ జి.శ్రీధర్, ఎన్.మల్లయ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత వారిని అభినందించారు.

మల్లన్న ఆలయ ఉద్యోగుల గలాట

- పాలనా వ్యవహార ఫిర్యాదులు, విభేదాలు తదితర అంశాలపై అంతరంగిక చర్చలో వాగ్వాదం
- కుర్చీలు పైకెత్తి దూషణల పర్వం!

5

వర్షం.. రైతుల హర్షం

- నైరుతి రాకతో రైతుల్లో సంబురం
- సాగు పనుల్లో నిమగ్నం



వర్షం పడడంతో పత్తి సాగు కోసం ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు

సిద్దిపేట అగ్రికల్చర్/హుస్నాబాద్‌రూరల్ జూన్ 23: సిద్దిపేట జిల్లాలో శనివారం రాత్రి, ఆదివారం మోస్తరు వర్షం కురవడంతో రైతులు పొలం బాట పట్టారు. మొన్నటి వరకు వానలు లేక పొలాలు ఎండుముఖం పట్టడంతో ఆందోళనకు గురైన రైతులు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

వ్యవసాయశాఖ సిద్ధం

జిల్లాలో వానాకాలం 5.51 లక్షల ఎకరాల్లో పునాస పంటల సాగుకు రైతులు సిద్ధం కాగా ఎరువులు, విత్తనాల సరఫరాపై వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేపట్టింది. ప్రధానంగా వరి 3 లక్షల ఎకరాలు, పత్తి 1.8 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మిగతా పంటలు తక్కువగానే సాగు విస్తీర్ణం ఉంది. మొక్కజొన్న 60 వేలు ఎకరాలు, కందులు 10 వేలు ఎకరాలు, పెసర వెయ్యి, ఇతర పంటలు 200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందుకోసం 136490.4 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయని అంచనా వేసి వ్యవసాయ శాఖ అందుకు సిద్ధం చేస్తుంది. జిల్లాలో ప్రధానంగా పత్తి రైతులను నకిలీ విత్తనాల బెడద వెంటాడుతోంది. వానాకాలం ఆరంభంలోనే టాస్క్‌ఫోర్స్, వ్యవసాయఅధికారులు, పోలీసులు నకిలీ విత్తనాలపై నిఘాపెట్టారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు సైతం చేస్తున్నారు.

హుస్నాబాద్‌లో..

ఖరీఫ్‌లో మొక్కజొన్న, పత్తి సాగు చేసిన రైతులకు హుస్నాబాద్ మండలంలో కురిసిన మోస్తరు వర్షంతో ఊరట లభించింది. ముందుగా కురిసిన వర్షాలకు పత్తి, మొక్కజొన్న సాగుచేసిన రైతులు ఆ తర్వాత వానలు లేక విత్తనాలు మొలకెత్తక భారీగా నష్టపోయారు. ఆ తర్వాత కురిసిన వర్షాలకు విత్తనాలు మొలకెత్తని చోట పోగుంటలుగా మళ్లీ విత్తనాలు నాటారు. విత్తనాలు చాటిన తర్వాత వరుణుడు కురుణించకపోవడంతో ఒకింత ఆందోళనకు గురయ్యారు. శనివారం 9 సెంటీమీటర్ల వర్షం పాతం నమోదైంది. ఆదివారం కురిసిన వర్షంతో రైతులు ఊరట చెందారు.



హుస్నాబాద్ మండలం నాగారంలో పత్తి మొలకలు

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

చిన్నకోడూరు: చెట్టుపై పిడుగు పడిన సంఘటన చిన్నకోడూరు మండలం మైలారం అనుబంధ గ్రామమైన కొండెంగలకుంటలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ ఘటనలో ఆ చెట్టు కింద ఉన్న నలుగురు అపస్మారక స్థితికి వెళ్లగా వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కొండెంగలకుంటకు చెందిన తాటికొండ శ్రీను కమ్మర్లపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు మామిడి తోటను కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. ఆదివారం శ్రీను తన భార్య లావణ్య, కూతురు నందిని, అత్తమ్మ సత్తవ్వ, కుమారుడు బన్నీ మామిడి తోటలో మొక్కజొన్న విత్తనాలు నాటుతున్నారు. సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో శ్రీను, లావణ్య, నందిని, సత్తవ్వ ఓ మామిడి చెట్టు కిందకు వెళ్లి కూర్చున్నారు. బన్నీ కొద్ది దూరంలో ఉన్న మరో చెట్టు కింద కూర్చున్నాడు. ఈ క్రమంలో వారు కూర్చున్న చెట్టుపై చలి పిడుగు పడి ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. శబ్దానికి చెట్టు కింద ఉన్న నలుగురు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. గమనించిన బన్ని గ్రామస్థులకు సమాచారం అందించాడు. వెంటనే వారిని కారులో సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో కోలుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

పల్లెవెలుగులో మెదక్ కలెక్టర్

జిల్లాకే బాస్ అయిన ఆ కలెక్టర్ ఆర్భాటాలు వదిలేసి, కనీసం సిబ్బంది కూడా వెంట లేకుండా సాధారణ ప్రయాణికుడిలా కుటుంబంతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఆయనే మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్. ఆయన ఆదివారం తన కుటుంబీకులతో కలిసి మెదక్ నుంచి జేబీఎస్ వెళ్లే ఆర్డినరీ బస్సులో ఎక్కారు. కలెక్టర్ అనే విషయం ఎవరికీ తెలియనీయకుండా నిరాడంబరంగా నర్సాపూర్ వరకు ప్రయాణించారు. అక్కడ బస్సు దిగి కారులో వెళ్లిపోయారు.

-నర్సాపూర్, జూన్ 23





హరీశ్‌రావు రాజీనామాకు సిద్ధంగా ఉండాలి

- రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు
- కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ నాయిని నరసింహారెడ్డి
- సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ నాయిని నరసింహారెడ్డి

సిద్దిపేటటౌన్/సిద్దిపేటఅగ్రికల్చర్/తొగుట/మర్కుక్ జూన్ 23: రైతులకు ఏకకాలంలో రుణమాఫీకి కాబినెట్ తీర్మానించడం అభినందనీయమని, ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న హరీశ్‌రావు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ నాయిని నరసింహారెడ్డి, ఆ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు.

సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నాయిని నరసింహారెడ్డి మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఒక్కొక్క హామీని నెరవేరుస్తున్నారని తెలిపారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల వరకు ఏకకాల రుణమాఫీ చేస్తామని ప్రకటించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో 4 గ్యారంటీలను అమలు చేసినట్లు తెలిపారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై అవాకులు చవాకులు మాట్లాడడం మానుకోవాలి హితవు పలికారు. సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పూజల హరికృష్ణ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీది రైతు ప్రభుత్వమని, ఆగస్టు 15లోపు రైతులందరికీ రుణమాఫీ ఏకకాలంలో జరగడం సంతోషకరమన్నారు. వరికి రూ. 500 బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సిద్దిపేటలో జరిగిన భూ అక్రమాలు, భూ కబ్జాలు, అవినీతిని వెలుగులోకి తీసుకొచ్చి అక్రమార్కులకు శిక్షపడేలా చేస్తామన్నారు. ఇక, తొగుటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. గతంలో సైతం రైతులకు ఒకే దఫాలో రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్‌కే ఉందని స్పష్టం చేశారు. రుణమాఫీ చేస్తే సిద్దిపేట ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా అన్న హరీశ్‌రావు కుంటి సాకులు చెప్పకుండా స్పీకర్ ఫార్మట్‌లో రాజీనామా లేఖతో సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేయడానికి చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వం కమీషన్ల కోసమే తెలంగాణ సంపదను దోచుకుని రూ.7లక్షల కోట్ల అప్పులు చేసి ఆర్థిక విధ్వంసాన్ని సృష్టించారని దుయ్యబట్టారు. రైతురుణ మాఫీపై కేబినేట్ ఆమోదం తెలపడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ మర్కుక్ మండల కేంద్రంలో మిఠాయిలు పంచుకున్నారు. హరీశ్‌రావు రాజీనామాకు సిద్ధంగా ఉండాలని మర్కుక్ మండల కాంగ్రెస్ జడ్పీటీసీ అభ్యర్థి తుప్పతి భిక్షపతి డిమాండ్ చేశారు. ఆయా సమావేశాల్లో కాంగ్రెస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, రాజేశం గౌడ్, సత్యనారాయణ, రాజిరెడ్డి, రాజు, శేఖర్, కృష్ణారెడ్డి, ఎల్లారెడ్డి, కనకయ్య, సురేందర్, రెడ్డి రాజు, బాబేష్, జనార్దన్‌రెడ్డి, దుబ్బాక నియోజక కన్వీనర్ చెరుకు విజయ్‌రెడ్డి (అమర్), జిల్లా నాయకులు గాంధారి నరేందర్‌రెడ్డి, చేగుంట మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంగళ్‌రావు, సీనియర్ నాయకులు విజయ్‌పాల్‌రెడ్డి, సాబేర్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ స్థలం విషయంలో ఇరువర్గాల ఘర్షణ

వెల్దుర్తి, జూన్ 23: ఆలయ స్థలం విషయంలో ఇరువర్గాలు గొడవపడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటన మండలంలోని ఆరెగూడెం గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామంలోని గడిమైసమ్మ ఆలయాన్ని గ్రామస్థులు సుమారు ఏడేళ్ల క్రితం నిర్మించి అక్కడే జాతర సమయాల్లో పూజలు నిర్వహించారు. గుడి పక్కన స్థలాన్ని గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి వద్ద గ్రామానికే చెందిన కౌడె మాధవి సుమారు ఏడాది క్రితం కొనుగోలు చేసింది. ఆ స్థలంలో ఇటీవల ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించగా.. గ్రామానికే చెందిన గోవింద్‌రెడ్డి, పనివారు అభ్యంతరం తెలిపారు. ఈ విషయంలో ఇరువురి మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతుంది. పాత స్థలంలోనే ఆలయాన్ని పునర్నిర్మించాలని గోవింద్‌రెడ్డి వర్గీయులు పట్టుబడుతుండగా తాము కొనుగోలు చేసిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతుంటే ఎందుకు అభ్యంతరం తెలుపుతున్నారంటూ కౌడె మాధవి కుటుంబసభ్యులు వాపోతున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఆలయ స్థలం విషయంలో మరోసారి గొడవ జరగగా ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు.



ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

మెదక్ సీఎస్ఐలో భక్తుల సందడి

మెదక్ కల్చరల్, జూన్ 23: మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం సందడి నెలకొన్నది. ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయమే శిలువ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతిష్ఠించిన అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులకు దైవ సందేశాన్ని చదివి వినిపించారు. భక్తులు కుటుంబసభ్యులతో కలిసి విందు భోజనాలు చేస్తూ చెట్ల కింద సేద తీరారు.

రామాయంపేటలో సైక్లింగ్ పోటీలు



రామాయంపేటలో సైక్లింగ్ పోటీల్లో క్రీడాకారులు

రామాయంపేట, జూన్ 23: అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవం సందర్భంగా రామాయంపేటలో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. ఆదివారం స్థానిక కళాశాల వద్ద మొదలైన సైక్లింగ్ ఎస్సీ కాలనీ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నది. ఖేల్ ఇండియా సైక్లింగ్ అకాడమి నిర్వహణలో జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయన్నారు.

వర్షాల కోసం భూలక్ష్మమ్మ ఆలయంలో పూజలు



తుర్కపల్లికి కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న రైతులు, మహిళలు

నారాయణఖేడ్, జూన్ 23: వర్షాలు కురియాలంటూ మనూరు మండలం ఎల్గోయి, అతిమ్యాల్‌గ్రామానికి చెందిన రైతులు ఆదివారం ఆయా గ్రామాల నుంచి తలలపై కలశాలు, తులసీ కోటలతో పాదయాత్ర చేస్తూ నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి శివారులోని భూలక్ష్మమ్మ ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా వర్షాలు సక్రమంగా కురిసి, పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. కాగా జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్ సైతం ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివకుమార్, బుచ్చిరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, అశ్వాక్‌పటేల్ పాల్గొన్నారు.

జోరుగా కలప అక్రమ రవాణా



కలపను తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

రేగోడు జూన్ 23: రేగోడులో కలప అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. వాల్టా చట్టాన్ని అమలుచేయాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వదిలేయడంతో ఈ అక్రమ రవాణా రోజురోజుకూ పెరుగుతున్నది. ప్రభుత్వం ఓ పక్క మొక్కలు నాటాలని, సంరక్షించాలని ప్రకటిస్తుంటే.. మరోపక్క కలప వ్యాపారులు చెట్లను యథేచ్ఛగా నరుకుతున్నారు. ఇదిలా ఉండగా చెట్లను నరికేందుకు, కలప రవాణాకు ఫారెస్ట్ అధికారులే అనుమతులు ఇస్తున్నారని ప్రచారం కూడా ఉన్నది. ఒక్క అనుమతితో 10 లారీల కలపను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అధికారులు స్పందించి కలప అక్రమ రవాణా, చెట్ల నరికివేతను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

హత్నూర, జూన్ 23: విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన సంఘటన హత్నూర మండలం లింగాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన రైతు నర్సింహులు తన పశువులను మేత కోసం గ్రామ శివారులోకి తోలుకెళ్లాడు. అయితే లూజ్ వైర్ల కారణంగా గేదెకు విద్యుత్ వైర్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు తెలిపారు.

27న స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 23: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో నాల్గవ తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 27న బాల, బాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి రాంచందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో ఎంపికలు నిర్వహించనున్నామని, ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. 01.09.2015 నుంచి 31.08.2016 మధ్య పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన 20 మంది బాలురు, 20 మంది బాలికలకు హకీంపేటలోని క్రీడా పాఠశాలలో రాష్ట్రస్థాయి ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. జూలై 10, 11వ తేదీల్లో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు 9000491112 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించాడని యువతి ఆత్మహత్య


హరిత(ఫైల్)

వర్గల్, జూన్ 23: ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించాడని యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్ఐ భువనేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం దండుపల్లి గ్రామానికి చెందిన కాస రమేశ్‌కు భార్య ముత్యాలు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురైన హరిత(17) గజ్వేల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నది. కాగా గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన బోయిని స్వామి అనే వ్యక్తిని ప్రేమించింది. పెళ్లి చేసుకోమని అడగడంతో అతను నిరాకరించాడని హరిత తన తల్లికి తెలిపింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం ఉదయం కుటుంబసభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా.. ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నీట మునిగి యువకుడి మృతి


మహ్మద్ ఫిరోజ్ (ఫైల్)

పాపన్నపేట, జూన్ 23: ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన ఏడుపాయల ఆలయ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టులో ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ సంగన్న వివరాల ప్రకారం.. హైదరాబాద్ చింతల్‌కు చెందిన మహ్మద్ ఫిరోజ్(21) శనివారం సాయంత్రం స్నేహితులతో కలిసి సరదాగా ఏడుపాయలకు వచ్చారు. రాత్రి అక్కడే ఉన్నారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో ఆలయ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. అందరూ కలిసి స్నానం చేస్తుండగా ఫిరోజ్ ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికితీసి, మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి యూసుఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

కారు అడ్డు తీయమన్నందుకు వ్యక్తిపై దాడి

● పరారీలో నిందితులు ● పోలీసుల గాలింపు


విజయ్‌కి చికిత్స అందిస్తున్న వైద్యులు

మునిపల్లి, జూన్ 23: సెల్ఫీ దిగుతూ రోడ్డుకు అడ్డంగా నిలిపిన కారును తీయమన్నందుకు ఓ వ్యక్తిపై దాడిచేసిన సంఘటన కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ఆదివారం జరిగింది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కంకోల్ గ్రామానికి చెందిన పటోళ్ల విజయ్ తన స్నేహితుడైన భాస్కర్‌రెడ్డితో కలిసి సంగారెడ్డి వైపు నుంచి స్వగ్రామమైన కంకోల్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో టోల్‌ప్లాజా వద్దకు రాగానే గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుపై కారు నిలిపి సెల్ఫీ దిగుతున్నారు. కారును పక్కకు జరపండి అంటూ విజయ్ చెప్పడంతో మాటామాట పెరిగి గొడవకు దారిసింది. దీంతో కోపంతో ఉన్న సదరు కారుకు సంబంధించిన వ్యక్తులు రాడ్డుతో విజయ్‌పై దాడిచేశారు. అంతటితో ఆగకుండా కత్తితో మరోసారి దాడికి పాల్పడ్డారు. దీంతో విజయ్ తల, చెవి, చెంపపై తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని సదాశివపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన నిందితులు పరారుకావడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. విజయ్ తండ్రి నాగిశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

గంజాయి పట్టివేత


పోలీసుల అదుపులో గంజాయి తరలిస్తున్న వ్యక్తి

మునిపల్లి, జూన్ 23: అక్రమంగా తరలిస్తున్న 300 గ్రాముల ఎండు గంజాయిని మునిపల్లి మండలంలోని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారంతో 165వ జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా జహీరాబాద్‌కు చెందిన ఎండీ.మోహిజ్‌కు చెందిన (టీఎస్ 07 ఎఫ్ఎల్ 5223) నెంబరు గల ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా.. అందులో 300 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైనట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. పట్టుబడిన ఎండు గంజాయితో పాటు బైక్‌ను సీజ్ చేశారు. గంజాయి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని తెలిపారు. అనంతరం సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సీహెచ్.చంద్రశేఖర్, ఎస్ఐ యాదయ్య, హెడ్ కానిస్టేబుల్ ఎండీ.అలీం, ఆంజ హుస్సేన్, కానిస్టేబుల్స్ సతీష్, రామారావు, గోపాల్ పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ ఉద్యోగుల గలాట

- పాలనా వ్యవహార ఫిర్యాదులు, విభేదాలు తదితర అంశాలపై అంతరంగిక చర్చలో వాగ్వాదం
- పరస్పరం కుర్చీలతో దాడి చేసుకునే యత్నం


కొమురవెల్లి ఆలయ గోపురం

చేర్యాల, జూన్ 23: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ఉద్యోగులు కొట్లాడుకున్నారు. ఎవరికి వారుగా తప్పులను ఎత్తిచూపుకుంటూ పరస్పర దూషణలకు దిగి చేయిచేసుకున్నారు. కుర్చీలతో పోట్లాడుకోబోయారు. కొన్నాళ్లుగా ద్వితీయ శ్రేణి అధికారులు, ఉద్యోగుల మధ్య కొనసాగుతున్న వైరాలు ఆదివారం మరోమారు బహిర్గతమవడం కలకలం రేపింది. ఈ మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్లన్న ఆలయ పాలన, వ్యవహారాల విషయాలతో పాటు టెండర్ల నిర్వహణ, ఇతరత్రా అంశాలు కొన్నాళ్లుగా వివాదాస్పదమవుతున్నాయి. అనర్హులైనా నచ్చినవారికి అందలమెక్కించి అర్హత కలిగిన వారికి విభాగాల బాధ్యతలు అప్పగించకపోవడం, పలువురిపైన చిన్నచూపు వహిస్తూ, ఓ వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తుండటంతో ద్వితీయశ్రేణి అధికారులు, ఉద్యోగులు, తాత్కాలిక సిబ్బంది, ఆలయవర్గాల మధ్య విబేధాలు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా పలువురు దశాబ్దాల కాలంగా ఇక్కడే తిష్టవేసి పనిచేస్తుండటంతో జవాబుదారీ తనంతో వ్యవహరించడం లేదు. అయా అంశాల దృష్ట్యా ఆలయంలో నెలకొన్న లోటుపాట్లు, జరుగుతున్న పొరపాట్లపై ఇతరుల పేరిట కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదులు చేసుకుంటున్నారు. సరిదిద్దేవారు లేకపోగా, ప్రక్షాళన చర్యలు చేపట్టకపోతుండటంతో 'ఆడింది ఆట, పాడింది పాట'గా తయారైంది. ఈ క్రమంలో ఈవోను ఏసీబీకి పట్టించేందుకు ప్లాన్ వేశానని ఓ ఉద్యోగి ఇటీవల సిబ్బందితో పాటు పలువురితో పేర్కొనడం, ఇతరత్రా ద్వితీయశ్రేణి అధికారులు విధులకు సక్రమంగా రాకపోవడం, వసతి గదులను బసకు వినియోగించుకుంటూ తమపై పెత్తనం చెలాయిస్తున్నందున సంగతి చూస్తామని చెప్పడం ఆ నోటా ఈనోటా బయటకు పొక్కింది. ఆయా పరిణామాలతో పాటు కమిషనర్ కార్యాలయాల్లో ఫిర్యాదులు, ఇతరత్రా అంశాలు ఆలయ ప్రతిష్టకు భంగం కలుగుతుండటంతో ఈవో బాలాజీశర్మ తన కార్యాలయంలో ఆదివారం ఉదయం ఏఈవో గంగా శ్రీనివాస్, ఎలక్ట్రికల్ విభాగం ఏఈ బి.అంజయ్య ఇతరత్రా ఉద్యోగులు, తదితరులతో చర్చించిసాగారు. అంతర్గత విషయాలను బయటకు ఉప్పందించకూడదని, ఫిర్యాదులు చేసుకోకుండా ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వర్తించాలంటూ ఈవో సూచించారు. ఈ క్రమంలో ఏఈవో గంగా శ్రీనివాస్, ఏఈ బి.అంజయ్య మధ్య మాటామాటా పెరిగిచేయి చేసుకునేందుకు ఉపక్రమించి తోపులాడుకున్నారు. ఒకరిపై మరొకరు తూలనాడుకుని కుర్చీలు విసరడానికి పైకి ఎత్తి గలాటాకు దిగారు. అక్కడ ఉన్న ప్లంబర్ విజయ్ కూడా కలగజేసుకున్నాడు. ఒకరిపై మరొకరు చెంపపై కొట్టుకున్నారు. పరిస్థితి జేజారిపోవడాన్ని గమనించి ఈవో అడ్డుపడి మందలించారు. చివరకు గొడవ సద్దుమణగడంతో బయటకు వెళ్లిపోయారు. అనంతరం ఎవరికి వారుగా భిన్నాభిప్రాయాలు వ్యక్తపరచడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ఈవో సమక్షంలో ఆలయాధికారులు గలాటపడడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ విషయమై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

నాపైనే కుర్చీ ఎత్తాడు

ఆలయ పాలన విషయాలపై ఈవో బాలాజీ అడిగిన ప్రశ్నలకు ఏఈ అంజయ్య నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. నాపట్ల కూడా నిర్లక్ష్యంగా మాట్లాడాడు. అకారణంగా అతడే నాపై కుర్చీ ఎత్తాడు. నేను అతడిపై చేయిచేసుకోలేదు. తప్పు చేయనప్పుడు నేనేందుకు క్షమాపణ చెబుతాను.

- గంగా శ్రీనివాస్, ఏఈవో

ఏఈవో, ప్లంబర్ చెంపపై కొట్టారు

రూ.500క్యూలైన్ టికెట్లు జారీచేస్తున్న నన్ను ఈవో కార్యాలయానికి రావాలనడంతో వెళ్లాను. నేను ఏమీ మాట్లాడకముందే అక్కడున్న ఏఈవో గంగా శ్రీనివాస్ నా చెంపపై కొట్టాడు. తర్వాత ప్లంబర్ సార్ల విజయ్ కూడా చెంపపై కొట్టాడు. చివరకు ఈవో మందలించడంతో క్షమాపణ చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంపై ఆలోచిస్తున్నాను.

- ఏఈ అంజయ, ఎలక్ట్రికల్


మల్లన్నస్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు


కొండపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

చేర్యాల, జూన్ 23: కొమరవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సందర్శనార్థం ఆదివారం వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనంచేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖ మండప పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాక పెట్టి ఒడిబియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత దర్శనం క్యూలైన్లల్లో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భక్తులతో నాచగిరి క్షేత్రం కిటకిట

వర్గల్, జూన్ 23: రాష్ట్రంలో రెండో యాదాద్రిగా పేరొందిన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలతో పాటు స్వామివారికి నిజాభిషేకాలు, కల్యాణం మొక్కుబడి సేవలను భక్తులు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు.

లక్ష్మీనృసింహస్వామి క్షేత్రానికి 28 గుంటల భూమి, 54 గజాలు ఆర్‌సీసీ బిల్డింగ్ విరాళం

వర్గల్, జూన్ 23: వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రానికి హైదరాబాద్ వాస్తవ్యులు కీర్తిశేషులు త్రిగుల్ల చంద్రశేఖరశర్మ భార్య అరుణ, కుమారులు కృష్ణ చంద్రశర్మ, రఘువీర్‌శర్మ, నందకిషోర్‌శర్మ నాచారంగుట్ట వద్ద సర్వే నెంబర్ 360 హీరాబాయమ్మ తోటలోని 28 గుంటల భూమిని ఆలయానికి విరాళంగా అందజేశారు. రిజిస్ట్రేషన్ పత్రాలు, ధరణి పాస్‌బుక్‌లను ఆలయ కార్యనిర్వహణ అధికారి అన్నపూర్ణకు ఇచ్చారు. అలాగే ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న అర్చకుడు కీర్తిశేషులు త్రిగుల్ల పద్మనాభశర్మ కుమారులు గోపాలకృష్ణశర్మ, విద్యాసాగర్‌శర్మ అదే సర్వే నెంబర్‌లోని హీరాబాయమ్మ తోటలోని 54 చదరపు గజాల ఆర్‌సీసీ బిల్డింగ్‌కు సంబంధించిన దాన పత్రాలను అందజేశారు. కాగా ఆలయం నుంచి శంకరమఠంలోని హీరాబాయమ్మ తోట వరకు స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోఛ్ఛరణలతో ఆశీర్వచనాలు, స్వామివారి శేషవస్త్రాలు వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు జగన్నాథచార్యులు, వేదపండితులు నాగబాల కామేశ్వరశర్మ, అర్చకులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ ఆలయంలో భక్తుల సందడి

జగదేవ్‌పూర్, జూన్ 23: కొండపోచమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు కొండపోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. గూడరాల వద్ద బోనం తయారు చేసుకుని డప్పు వాయిద్యాలతో శిగాలుగుతూ అమ్మవారి చెంతకు చేరుకున్నారు.

వనదుర్గామాతకు భక్తుల తాకిడి

పాపన్నపేట, జూన్ 23: ఏడుపాయల వనదుర్గామాత ఆలయం భక్తులతో కిటకిటాలాడింది. ఆదివారం సెలవు కావడంతో ఉమ్మడి జిల్లావాసులతో పాటు నిజామాబాద్, కరీంనగర్, పొరుగు రాష్ట్రాలైనా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున 5-30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మంజీరా నదిపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.


భూమి పత్రాలను ఈవో అన్నపూర్ణకు అందజేస్తున్న త్రిగుల్ల అరుణ, కుటుంబసభ్యులు


పాపన్నపేట: భక్తులతో కిటకిటలాడుతున్న ఏడుపాయల వనదుర్గామాత ఆలయ ప్రాంగణం

రోడ్ల పక్కనే మద్యం అడ్డాలు!

- నిర్మానుష్యం నుంచి జన సందోహంలోకి..
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


తిమ్మానగర్ వెళ్లే రహదారి పక్కన తాగి పగులగొట్టిన సీసాల గాజు పెంకులు

మెదక్ కల్చరల్, జూన్ 23: ఒకప్పుడు నిర్మానుష్య ప్రాంతంలో ఉండే మందుబాబుల అడ్డాలు.. నేడు రోడ్డు పక్కకు, జనసందోహంలోకి వచ్చాయి. ఇళ్ల మధ్య, ప్రభుత్వ కార్యాలయాల పక్క, జన సమూహాలకు దగ్గరగా.. గ్రామాలకు వెళ్లే దారిలో, ప్రభుత్వ పాఠశాలల్లో సిట్టింగ్‌లు వేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మద్యం సేవించిన అనంతరం సీసాలను పగులగొట్టి రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు. దీంతో దారిపోయే వారికి గాజు పెంకులు గుచ్చుకుని విలవిలలాడుతున్నారు.

పోలీసుల నుంచి తప్పించుకునేందుకు..

తాగి వాహనాలు నడిపితే శిక్షలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నా.. మందుబాబులు పట్టించుకోవడం లేదు. అయితే పట్టణ పరిసరాల్లో పోలీసుల నిఘా ఎక్కువగా ఉంటుందని భావించి.. కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. గ్రామాలకు వెళ్లేదారుల్లో, అటవీ ప్రాంతంలో సిట్టింగ్ ఏర్పాటు చేసుకుని పార్టీ కానిచ్చేస్తున్నారు. ఒకానొక సమయంలో ఆయా ప్రాంతాల గుండా వెళ్లేవారిపై దాడులకు దిగుతున్న సందర్భాలూ లేకపోలేదు. పోలీస్ అధికారులు స్పందించి రోడ్డు పక్క, గ్రామ శివారుల్లో మద్యంసేవించేవారిపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

ఓపెన్‌గా మద్యం సేవిస్తే కేసులే

జన సమూహాల్లో కానీ, రోడ్డు పక్కన కానీ, ప్రజలకు ఇబ్బంది కలిగించే చోట మందు బాబులు సిట్టింగ్ వేస్తే కేసులే. వీరిపై ఓపెన్ డ్రింకింగ్ లిక్కర్ ప్రొహిబిషన్ కేసు నమోదు చేస్తాం. కొద్దినెలల నుంచి ఓపెన్‌గా మద్యం సేవిస్తున్న వారిపై 17 కేసులు నమోదు చేశాం.

- శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, మెదక్

గటారా టూ డ్రోన్ వరకూ..

● నూతన టెక్నాలజీ వైపు రైతుల చూపు ● ట్రాక్టర్, డ్రోన్లతోనే మందుల పిచికారీ ● మూలనపడ్డ పంపులు



ట్రాక్టర్లతో పత్తిపంటకు పిచికారీ చేస్తున్న దృశ్యం, వరి పంటకు డ్రోన్‌తో పిచికారీ


పెట్రోల్ పంపు, చేతి పంపు


గటారా

మునిపల్లి, జూన్ 23: వ్యవసాయ రంగంలో రోజురోజుకూ ఆధునిక యంత్రాలు రావడంతో పాత పంపులు మూలనపడ్డాయి. టెక్నాలజీ పెరగడంతో పంటలకు కూలీలు అవసరం లేకుండా మందులను పిచికారీ చేస్తున్నారు. ప్రస్తుతం పంటల ఎదుగుదలకు, చీడ పురుగులను తొలగించేందుకు పిచికారీ చేయాల్సిందే. 30 ఏళ్ల క్రితం గరాటా అనే పరికరాన్ని ఎద్దుల బండిపై అమర్చి రైతులు పంటలకు పిచికారీ చేసేవాళ్లు. గటారా తర్వాత చేతిపంపు, పెట్రోల్ (తైవాన్), చార్జింగ్ పంపులతో పత్తి, కంది, వేరుశనగ, జొన్న తదితర పంటలకు పిచికారీ చేసేవాళ్లు. ప్రస్తుతం తైవాన్ పంపులను సైతం పక్కనపెట్టి ట్రాక్టర్లతో పంటలకు (స్ప్రే) పిచికారీ చేస్తున్నారు. టెక్నాలజీ మారిన కొద్దీ ఎన్నో యంత్రాలు వస్తున్నాయి. రైతులకు కష్టం లేకుండా డ్రోన్ల సహాయంతో పంటలకు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు.

తైవాన్ పంపుల ధరలు పెరగడంతో

పంటలకు పై మందులు పిచికారీ చేయాలన్నా తైవాన్ పంపులు కావాల్సిందే. అయితే 20 ఏళ్ల క్రితం తైవాన్ పంపులను సబ్సిడీ కింద ప్రభుత్వం రైతులకు అందించింది. తైవాన్లకు గిరాకీ పెరగడంతో ధరలు కూడా పెరిగాయి. దీనికితోడు తైవాన్ పంపుతోనైతే ముగ్గురు కూలీలు నీళ్ల మోసేందుకు అవసరం ఉంటుంది. దీంతో చేసేదేమి లేక ట్రాక్టర్లతో ఎకరాకు రూ.400ల చొప్పున పంటలకు పిచికారీ చేస్తున్నారు.

డ్రోన్లకు భలే డిమాండ్

వరిలో తైవాన్ పంపులతో పిచికారీ చేసేందుకు ఇబ్బందులు ఎందుకని రైతులందరూ డ్రోన్లతో పంటలకు పిచికారీ చేయిస్తున్నారు. దీంతో డ్రోన్లకు భలే డిమాండ్ ఉంది. ఎకరాకు రూ.500 చొప్పున పిచికారీ చేయించుకుంటున్నారు.

తైవాన్ పంపునకు కూలీలు అవసరం

తైవాన్ పంపుతో పంటలకు మందులను పిచికారీ చేసేందుకు ముగ్గురు కూలీలు అవసరం. దీనికితోడు కూలీల రేట్లు కూడా పెరగడంతో డ్రోన్లతో మందులను పిచికారీ చేసుకుంటున్నాం.

- రఘునాథ్‌రెడ్డి, రైతు, గంగోజీపేట, చౌటకూర్

కంది, ధనియాల పంటలకే కొట్టేవాళ్లం

గతంలో గటారా పంపును ఎద్దుల బండికి అమర్చి కంది, ధనియాల పంటలకు గంధకం కొట్టేవాళ్లం. అప్పుడు పంటలకు మందులు కొట్టేవాళ్లం కాదు. ఇప్పుడైతే ప్రతీ పంటకు మందులు వాడక తప్పడం లేదు.

- శామయ్య, రైతు, మల్లికార్జున్‌పల్లి గ్రామం

పర్యాటక క్షేత్రం.. ప్రకటనలకే పరిమితం

- ఏటా సెప్టెంబరు 17న ప్రజాప్రతినిధుల, రాజకీయ నాయకుల హామీ
- ఆ తర్వాత పట్టించుకోని వైనం
- కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేయాలని గ్రామస్థుల విన్నపం


బైరాన్‌పల్లి గ్రామంలోని బురుజు

ధూళిమిట్ట, జూన్ 23: నిజాం రజాకార్ల ఆగడాలకు ఎదురొడ్డి పోరాడి నిలిచిన గ్రామంగా సిద్దిపేట జిల్లాలోని ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి కీర్తి గడించి చరిత్రలో నిలిచింది. గ్రామంలో ఏర్పచుకున్న రక్షక దళాలు బురజు కేంద్రంగా రజాకార్ల దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. ఇది తట్టుకోలేని రజాకార్లు ఖాసీం రజ్వీ ఆధ్వర్యంలో 1948 ఆగస్టు 27 బైరాన్‌పల్లి గ్రాంపై మూకుమ్మడి దాడిచేసి.. దొరికిన వారిని దొరికినట్టుగా కాల్చి చంపారు. రజాకార్ల ఆగడాలకు, అన్యాయాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో అనేక మంది వీరమరణం పొందారు.

పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయాలి

రజాకార్ల ఆగడాలకు, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన మా గ్రామ చరిత్రను కాంగ్రెస్ ప్రభుత్వం భావితరాలకు తెలిసేలా పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి. అలాగే గ్రామంలో స్మృతీవనాన్ని ఏర్పాటు చేసి పర్యాటక క్షేత్రంగా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఏటా సెప్టెంబరు 17న ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు గ్రామంలోని బురుజును సందర్శించి పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని చెబుతున్నారే.. కానీ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెల్లవారేలోపే గ్రామాన్ని రజాకార్లు చుట్టుముట్టారు

1948 ఆగస్టు 27న తెల్లవారేలోపే రజాకార్లు దొంగచాటుగా లారీల్లో తుపాకులతో గ్రామాన్ని చుట్టుముట్టి బురుజు మీద ఉన్న గ్రామ రక్షక దళాల సభ్యులు నిద్రమేల్కొనే లోపే కాల్చిచంపారు. తర్వాత గ్రామంలో దొరికిన వారిని దొరికినట్టుగా 96 మందిని చంపారు. తుపాకుల మోతలతో ప్రజలు భయంతో వణికిపోయారు.

- ఆనాటి స్వాతంత్ర్య సమరయోధుడు చల్ల చంద్రారెడ్డి



శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం

● బలిదాన్ దివాస్‌లో బీజేపీ నాయకులు

సిద్దిపేట రూరల్, జూన్ 23: జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ మండల అధ్యక్షుడు అన్నసారం సురేష్‌గౌడ్ పేర్కొన్నారు. శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సిద్దిపేట రూరల్ మండలం బండచర్లపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, బూత్ అధ్యక్షుడు స్వామి, సీనియర్ నాయకులు శ్రీకాంత్, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

● **చిన్నకోడూరు:** శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా బీజేపీ నాయకులు ఆదివారం చిన్నకోడూరు మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యకరమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సూరగోని శేఖర్‌గౌడ్, బీజేవైఎం మండలాధ్యక్షుడు మాతంగి నాగరాజు, ప్రధాన కార్యదర్శి మహేశ్, ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పరుశురాములు, సంపత్, రమేష్ పాల్గొన్నారు.

● **బెజ్జంకి:** బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యకరమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌రావు, మల్లేశంగౌడ్, సునీత పాల్గొన్నారు.

● **నంగునూరు:** బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో నంగునూరులో శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పప్పు సురేందర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సతీష్‌గౌడ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు జి. రజనికర్‌రెడ్డి, నరేష్, శ్రీను, సీనియర్ నాయకులు వి.రజనికర్‌రెడ్డి, అమిరిశెట్టి ప్రవీణ్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్:** శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆదివారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, పట్టణ కన్వీనర్ చిట్టి గోపాల్‌రెడ్డి, కొత్తపల్లి అశోక్, తోట స్వరూప, రాయికుంట చందు, రవీందర్, సమ్మయ్య, వేముల దేవేందర్‌రెడ్డి, శ్రీధర్, బాబురావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● **కుకునూరుపల్లి:** బీజేపీ కుకునూరుపల్లి మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బలిదాన్ దివస్ నిర్వహించారు. శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులులర్పించారు. కార్యక్రమంలో దాసరి స్వామి, నవీన్‌కుమార్, సదానందం, గట్టు అనిల్, బిక్షపతి, స్వామి ఉన్నారు.

● **గజ్వేల్:** శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ సీనియర్ నాయకులు యెల్లు రాంరెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, మండలాధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కుడిక్యాల రాములు, అసెంబ్లీ కోకన్వీనర్ మహేశ్, నత్తి శివకుమార్, కోదండం శ్రీనివాస్‌రెడ్డి, నాయిని సందీప్, మామిండ్ల నాగులు, ఉప్పల మధు, మర్కంటి ఏగొండ పాల్గొన్నారు.


కుకునూరుపల్లి: శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


హుస్నాబాద్: శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


గజ్వేల్: శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


నంగునూరు: శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


బెజ్జంకి: శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఫైళ్లు, ఫర్నిచర్ భద్రంగానే ఉన్నాయి

● అనుమతి లేకుండా చీరల తరలింపు

● సుడా ఉద్యోగిని తొలగించిన వైస్ చైర్మన్

సిద్దిపేట అర్బన్, జూన్ 23: సుడా పరిధిలో శనివారం రాత్రి జరిగిన సంఘటనలో ఫైల్స్, ఫర్నిచర్ తీసుకువెళ్లారన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవని సుడా వైస్ చైర్మన్ ప్రసన్నరాణి తెలిపారు. సుడా కార్యాలయంలో జరిగిన సంఘటనపై శనివారం ఆమె ప్రకటన విడుదల చేశారు. సుడా కార్యాలయంలో భద్రపరచిన బతుకమ్మ చీరలను పుల్లూరు పరిధిలోకి తరలించాలని కొంత కాలం కిందట సూచించిన మాట వాస్తవమేనని, కానీ శనివారం చీరల తరలింపుకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా చీరలను తరలించిన చరణ్ అనే ఉద్యోగిపై చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఈ సంఘటనపై పూర్తి విచారణ జరిపించాలని సుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ నందనం ఆధ్వర్యంలో 3 టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కూడా తెలిపారు

సుడా ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి

● కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్


త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట అర్బన్, జూన్ 23: సుడా కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ, కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో ఆదివారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొంత మంది సుడా కార్యాలయంలో ఫైల్స్ మాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ సంఘటనపై సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖలకు కూడా ఫిర్యాదు చేస్తామని, పూర్తి విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ కౌన్సిలర్ శ్రీదేవి బుచ్చిరెడ్డి ,నాయకులు ముద్దం లక్ష్మి, గయాజుద్దీన్, మధు, రషీద్, కవిత, బిక్షపతి పాల్గొన్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు.!


చిన్నకోడూరులో నరికివేసిన చెట్ల కొమ్మలు

చిన్నకోడూరు, జూన్ 23: అధికారుల సమన్వయ లోపంతో పచ్చని చెట్లు కనుమరుగవుతున్నాయి. గ్రామాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా హరితహారం పథకం కింద మొక్కలు నాటిస్తున్నది. పచ్చదనం పెంపొందించేందకు ప్రభుత్వ భూములు, గ్రామాల్లోని రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటిస్తున్నారు. అయితే గ్రామాల్లో విద్యుత్ తీగల కింద నాటడం వల్ల అవి వృక్షాలుగా మారుతున్న తరుణంలో గొడ్డలి వేటుకు గురవుతున్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నదన్న కారణంతో వాటిని నరికేస్తున్నారు.

కనుమరుగవుతున్న పచ్చదనం

ప్రత్యేక లక్ష్యాన్ని నిర్దేశించి గ్రామాల్లోని నర్సరీల ద్వారా అవసరమైన మొక్కల పెంపకానికి చర్యలు చేపడుతున్నారు. కానీ లక్ష్యాన్ని సాధించడంలో చూపుతున్న శ్రద్ధ మొక్కలను ఎక్కడెక్కడా నాటాలనే దానిపై చూపడం లేదు. ఫలితంగా నీడనిచ్చే చెట్లు మోడుగా మారుతున్నాయి.

శాఖల మధ్య సమన్వయ లోపం..

ఆదివారం చిన్నకోడూరు మండల కేంద్రంలో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. ముందు చూపుతో విద్యుత్ తీగలకు దూరంగా మొక్కలను నాటితే ఇటాంటి పరిస్థితులు ఎదురయ్యేవి కావని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

ప్రాథమిక పాఠశాలలుగా అంగన్‌వాడీ కేంద్రాలు

● నేటి నుంచి అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

అక్కన్నపేట, జూన్ 23: ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలుగా మార్చేందుకు కార్యచరణ రూపొందించి, అంగన్‌వాడీ టీచర్లకు నేటి నుంచి శిక్షణ ఇచ్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. హుస్నాబాద్ ఐసీడీఎస్ పరిధిలోని అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి మండలాల పరిధిలో 211 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఉన్న గదులలో 98 అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టింది.ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు అంగన్‌వాడీ టీచర్లకు విద్య బోధనపై శిక్షణ ఇచ్చేందుకు హుస్నాబాద్ పట్టణంలో రెండు సెంటర్లను ఏర్పాటు చేశారు. టీచర్లకు శిక్షణ ఇవ్వడంతోపాటు ఆ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్స్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే ఈ ప్రీ ప్రైమరీ స్కూల్స్‌లో మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలో విద్యా బోధన చేసేందుకు కసరత్తు ప్రారంభించారు.

చదువుపై ఆసక్తి పెంచేందుకే..



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు చదువుపై ఆసక్తి పెంపొందించేందుకే ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నది. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధన అందించేందుకు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నాం.

- జయమ్మ, ఐసీడీఎస్ సీడీపీవో, హుస్నాబాద్ ప్రాజెక్టు

సికింద్లాపూర్‌లో పోచమ్మ తల్లికి బోనాలు


బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

చిన్నకోడూరు, జూన్ 23: మండలంలోని సికింద్లాపూర్‌లో ఆదివారం గ్రామ దేవత పోచమ్మ తల్లికి బోనాలు తీశారు. ఈ సందర్భంగా బోనాలను డప్పు చప్పుళ్ల, శివసత్తుల పూనకాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.

శివాలయంలో సహస్ర ఘటాభిషేకం

కుకునూరుపల్లి, జూన్ 23: మండలంలోని మెదినీపూర్ గ్రామంలో ఉన్న శ్రీ ఉమా శంభులింగేశ్వరాలయంలో ఆదివారం సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఈశ్వర సేవా సమితి సిద్దిపేట బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మెదినిపూర్‌లోని శ్రీ ఉమాశంభు లింగేశ్వర శివాలయంలో శివుడికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు 1016 బిందెల నీటితో స్వామివారికి అభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ ఘటాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి పునఃప్రతిష్ఠ

మర్కుక్, జూన్ 23: మండలంలోని చేబర్తిలో బొడ్రాయి పునఃప్రతిష్ఠను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని వారం రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి నీళ్లతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బబ్బూరి రాందాస్‌గౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ అశోక్, మాజీ ఉపసర్పంచ్ స్వామి, మాజీ వార్డు సభ్యులు లత, అంజనేయులు, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు యాదగిరి, గ్రామ పెద్దలు జాలని, బాల్‌నర్సయ్య బబ్బూరి రాములుగౌడ్, పోయిల మల్లేశం, కొండ గాలేష్ తదితరులు ఉన్నారు.

రుణమాఫీ పై హర్షం

బెజ్జంకి, జూన్ 23: రైతులకు ఆగస్టు 15లోగా రెండు లక్షల రుణమాఫీ చేస్తామని మంత్రివర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. రైతులశ్రేయస్సు కోసం బడుగు బలహీనవర్గాల కోసం ప్రభుత్వం పని చేస్తున్నదని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరు కాపు నూతన కార్యవర్గ నియామకం

బెజ్జంకి, జూన్ 23: మండలంలోని వడ్లూరు గ్రామంలో మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా గాండ్ల పెద్ద తిరుపతిని కుల సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన తిరుపతి కుల సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

గజ్వేల్, జూన్ 23: నేడు ఉపాధి హామీ 2023-24 ఆర్థిక సంవత్సరపు 14వ విడత సామాజిక తనిఖీకి సంబంధించిన ప్రజావేదిక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ ఎంపీడీవో ప్రవీణ్ తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీసీ బ్లాక్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ప్రారంభం అవుతుందని తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది హాజరు కావాలన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ముదిరాజ్ మర్కుక్ సంఘం అధ్యక్షుడు

మర్కుక్, జూన్ 23: మండల బీఆర్ఎస్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ పుట్టిన రోజు సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు కనకయ్యకు శాలువా కప్పి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

హుస్నాబాద్, జూన్ 23: హుస్నాబాద్‌కు చెందిన రుద్రారపు రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న పదోతరగతి స్నేహితులు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబసభ్యులకు అందించారు. కార్యక్రమంలో బొద్దుల శంకర్, పున్న అశోక్, వరియోగుల అనంతస్వామి, బొల్లంపల్లి రవీందర్, ఎగ్గోజు సుదర్శనచారి ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్

కుకునూరుపల్లి, జూన్ 23: కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బెజ్జంకి/కొండపాక/చేర్యాల/నంగునూరు, జూన్ 23: క్రీడా పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి నాల్గో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయా మండలాల ఎంఈవోలు, ఇన్‌చార్జి ఎంఈవోలు తెలిపారు. క్రీడా పాఠశాలల్లో దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరంలో మూడో తరగతి పూర్తి చేసి 01-09-2015 నుంచి 31-08-2016 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని నింపి సంబంధిత ధ్రువపత్రాలతో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలల్లోని పీడీలకు ఈనెల 24 తేదీలోగా అందజేయాలని పేర్కొన్నారు. ఈనెల 25 వ తేదీన మండల స్థాయి సెలక్షన్స్, 27 తేదీన జిల్లాస్థాయి సెలక్షన్స్ ఉంటాయని తెలిపారు.

అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేయండి


● డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



మాట్లాడుతున్న నాయకులు

గజ్వేల్, జూన్ 23: అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేసి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. దళితుల సమగ్ర అభివృద్ధి, రక్షణలపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గజ్వేల్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద డీబీఎస్ అధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పథకం స్థానంలో అంబేడ్కర్ అభయహస్తం పథకానికి రూ.12 లక్షలకు పెంచి అమలు చేస్తామన్నా హామీ హామీగానే మిగిలిపోయిందన్నారు. వారితో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, ఇందుప్రియాల్ స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌కు 271 మంది హాజరు


ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

నంగునూరు, జూన్ 23: మండలంలోని రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండో రోజు ఆదివారం పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగింది. 271 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తెలిపారు. స్లాట్ నమోదు చేసుకుని వివిధ కారణాల వల్ల హాజరుకాని అభ్యర్థులు మరుసటి రోజు హాజరు కావచ్చని తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు.

రోడ్డుపై పారుతున్న మురుగునీరు


గుంతలో నిలిచిన మురుగునీరు

చేర్యాల, జూన్ 23: కొమురవెల్లి మల్లన్న ఆలయ సమీపంలోని ఐనాపూర్ వెళ్లే దారిలో మురుగునీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్నది. ఎవరూ పట్టించుకోకపోవడంతో కొన్నాళ్లక్రితం గోతి ఏర్పడింది. కొద్దిరోజులుగా డ్రైనేజీ నీరు ప్రవహిస్తూ గోతిలో నిల్వ ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దోమలకు ఆవాసమై దుర్గంధం వెదజల్లుతున్నదని స్థానికులు వాపోతున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కరువు

● 20 ఏళ్లుగా అదే దుస్థితి

● కలగా మిగిలిన కళాశాల ప్రహరీ

మద్దూరు, జూన్ 23 : మద్దూరు మండల కేంద్రంలో 2004లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కరువయ్యాయి. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ప్రచారం నిర్వహిస్తున్నాప్పటికీ, ఇక్కడ మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. ఈ కళాశాలలో సుమారు 180 మందికి పైగానే విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం మౌలిక వసతులను విస్మరించడంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఇబ్బందులతోనే నెట్టుకొస్తున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. కళాశాలలో విద్యార్థులకు కనీస అవసరాలైన మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. 20 ఏళ్ల పూర్తయినా కళాశాలకు ప్రహరీ లేదు. దీంతో సెలవు రోజుల్లో కళాశాల ఆవరణ మందు బాబులకు అడ్డాగా మారుతోందన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. కిటికీ అద్దాలు ఆకతాయిల మూలంగా ధ్వంసం అవుతున్నట్లు ఆరోపణలున్నాయి.


ప్రహరీ లేని ప్రభుత్వ జూనియర్ కళాశాల

ప్రహరీ నిర్మించాలి



కళాశాలకు తక్షణమే ప్రహరీ నిర్మించాలి. మౌలిక వసతులైన మూత్రశాలలు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి. ప్రహరీ లేకపోవడంతో కళాశాల ఆకతాయిలకు అడ్డాగా మారుతోంది. ప్రహరీ నిర్మిస్తే రక్షణ ఉంటుంది.

- శ్రీనివాస్ కళాశాల అధ్యాపకుడు, మద్దూరు

రైతాంగ సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

● డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న నర్సారెడ్డి

గజ్వేల్, జూన్ 23: రైతాంగ సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీని అన్ని రకాల రుణాలకు వర్తింపజేస్తూ, నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గానికి గజ్వేల్ రైతాంగం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరికీ రుణమాఫీ వర్తిస్తుందని, గతంలో ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు చేసిందేమీ లేదన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భూనిర్వాసితులకు అండగా ఉంటామని, 2018 సంవత్సరానికి కటాఫ్‌గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పెద్దలను కలసి 2018 సంవత్సరానికి ముందు ఉన్న రుణాలను మాఫీ చేసేలా జీవో విడుదల చేయించేందకు కృషి చేస్తానన్నారు. నేడు మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్‌రావులను కలిసి ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ఆయనవెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పట్టణ అధ్యక్షుడు మోహన్నగారి రాజు, నాయకులు సుభాష్ చంద్రబోస్, సర్దార్‌ఖాన్, శివరాంరెడ్డి, గంగిశెట్టి రాజు, నక్క రాములుగౌడ్, సురేశ్, మల్లారెడ్డి తదితరులున్నారు.

'కల్యాణలక్ష్మి నిధులను విడుదల చేయడంలో విఫలం'


అంజిరెడ్డి

ములుగు, జూన్ 23: కల్యాణలక్ష్మి నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్, ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పెళ్లి చేసుకుని కల్యాణలక్ష్మి కోసం పేద కుటుంబాల వారు పడిగాపులు కాస్తున్నారన్నారు. కాంగ్రెస్ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, కల్యాణలక్ష్మి నిధులు విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు నిధులను విడుదల చేసి రైతులను ఆదుకోవాలనే డిమాండ్ చేశారు.

రేబర్తి సొసైటీ పరిధిలో రూ.4.12 కోట్ల రుణమాఫీ

మద్దూరు, జూన్ 23: మండలంలోని రేబర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 589 మంది రైతులకు రూ.4.12 కోట్ల రుణమాఫీ కానున్నదని సొసైటీ సీఈవో బోయిని శ్రీధర్ తెలిపారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడారు. అర్హులైన వారి జాబితా జిల్లా అధికారులకు పంపించినట్లు తెలిపారు. సొసైటీ పరిధిలో ఏ క్లాసు సభ్యత్వం కలిగిన రైతులు సుమారు 6 వేల మంది ఉన్నారని, ఇందులో 880 మంది రైతులకు రుణాలు అందించామని తెలిపారు. ఇందులో ప్రభుత్వం విధించిన కట్ డేట్‌కు రుణమాఫీకి అర్హులైన వారు 589 మంది రైతులు ఉన్నట్లు వెల్లడించారు. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 మధ్యలో రుణాలు పొందిన రైతులకు లబ్ధిచేకూరనున్నట్లు స్పష్టం చేశారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది

● మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్, జూన్ 23: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని సంఘమిత్ర బీఈడీ కళాశాలలో ఆదివారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ స్థాయి జానపద, కోలాట పోటీల బహుమతుల ప్రధాన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సాంస్కృతిక రంగాలతో మానసిక ఉల్లాసం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులరెడ్డి, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వలస సుభాష్, వీరసోమయ్య, కో ఆర్డినేటర్ యాదగిరి, గీత, శారద, బాలాజీసింగ్, పరశురాములు గౌడ్ ఉన్నారు.

విద్యార్థినికి బంగారు పతకం


పతకం, ప్రశంసాపత్రాన్ని చూపుతున్న విద్యార్థిని


సిద్దిపేట క్రైం, జూన్ 23: రాష్ట్ర వ్యాప్తంగా పదోతరగతిలో ఉర్దూ మీడియంలో ప్రతిభ కనబర్చినా విద్యార్థినులకు మదినా ఎడ్యుకేషన్ సెంటర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నాంపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పతకాలు అందించారు. ఇందులో సిద్దిపేట విద్యార్థిని బంగారు పతకాన్ని అందుకుంది. సిద్దిపేట నాసర్‌పుర ఉర్దూ పాఠశాలలో 10 తరగతిలో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అయీషా సిద్ధిఖకు బంగారు పతకం, ప్రశంసాపత్రం అందజేశారు. పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు అఫ్జల్ షరీఫ్ హర్షం వ్యక్తం చేశారు.

'వేదాలే మానవ మనుగడకు మూలం'



విద్యాధరిలోని వేద విద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులు

వర్గల్, జూన్ 23: వేదాలే మానవ మనుగడకు మూలమని వర్గల్ విద్యాధరి క్షేత్రం ఆలయ కమిటీ సభ్యుడు యాయవరం రాజశేఖరశర్మ పేర్కొన్నారు. విద్యాధరి క్షేత్రానికి అనుబంధంగా నిర్వహిస్తున్న శ్రీశారదాస్మార్త వేద విద్యాలయంలో ఆదివారం 22 మంది విద్యార్థులకు వేద పఠించేందుకుగాను ప్రవేశం కల్పించారు. ఈ సందర్భంగా రాజశేఖరశర్మ మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయలను పరిరక్షించడమే తమ లక్ష్యమని, అందుకు గాను ఆలయం వద్ద నిష్ణాతులైన ఆచార్యులు, సకల వసతులతో కూడిన వేద విద్యాలయాన్ని ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలుగా వేద విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. తమ వేద పాఠశాలలో 22 మంది విద్యార్థుల చేరికతో విద్యను అభ్యసిస్తున్న వారి సంఖ్య 93కు చేరిందని పేర్కొన్నారు. వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని వేద విద్యాలయం రాష్ట్రంలోనే చక్కటి ఫలితాలు సాధిస్తూ, ఆదర్శంగా నిలవాలన్నదే క్షేత్ర వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి లక్ష్యమన్నారు.

రైల్వేగేట్ బ్రిడ్జి వద్ద వాహనదారుల ఇబ్బందులు


వర్షపు నీటిలోంచి వెళ్తున్న కారు

చేర్యాల, జూన్ 23: కొమురవెల్లి శివారులోని రైల్వేగేట్ వద్ద అండర్‌పాస్ నిర్మాణ పనుల కారణంగా సమీపంలోని బ్రిడ్జికింది నుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి దారి చిత్తడిగా మారింది. బ్రిడ్జి కింద వర్షపు నీరు నిల్వ ఉండి ఇబ్బందులకు గురిచేస్తుంది. దీంతో పలువాహనాలు అదుపుతప్పడంతో పాటు దిగబడుతున్నాయి. ఒక వాహనం వస్తే మరొక వాహనం ఆగాల్సిన దుస్థితి నెలకొన్నది.



మండలంలోని గోనెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

-చిన్నకోడూరు